


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 17 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 89 పేజీలు : 4 వెల : రూ 3-00


### దేశంలో కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుపై
# సుప్రీంకోర్టులో విచారణ



న్యూఢిల్లీ: సామూహిక కిచెన్ల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించకపోతే.. కోర్టే స్పష్టమైన ఆదేశాలిస్తుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం స్పష్టం చేసింది. కమ్యూనిటీ కిచెన్ల కోసం ఉమ్మడి పథకాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో సమావేశం నిర్వహించాలని కేంద్రాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అన్ని రాష్ట్రాలతో సమావేశమై మూడు వారాల్లోగా ప్రణాళికను సమర్పించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం సమావేశానికి పిలిచినప్పుడు అన్ని రాష్ట్రాలూ సహకరించాలని ఆదేశించింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ అండర్ సెక్రటరీ ద్వారా అఫిడవిట్ దాఖలు చేయడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజలు ఆకలితో చనిపోతున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పౌష్టికాహార లోపానికి సంబంధించిన అంశం కాదని, ఆకలికి సంబంధించినదని, ఈ రెండు అంశాలను ఒకదానితో ఒకటి కలపవద్దని సీజేఐ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఏకరూప విధానం కావాలని... అందుకోసం రాష్ట్రాలతో మాట్లాడి ఉమ్మడి కమ్యూనిటీ కిచెన్‌పై సూచనలు, సలహాలు తీసుకోవాలని సుప్రీం సూచించింది. పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటా, ఆహారధాన్యాల పంపిణీపై రాష్ట్రాలతో మాట్లాడాలని కేంద్రానికి సుప్రీం సూచించింది. కమ్యూనిటీ కిచెన్ కోసం ఉమ్మడి పథకాన్ని అమలు చేయడంపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందో... లేదో స్పష్టంగా చెప్పాలని తీవ్రస్వరంతో ధర్మాసనం ప్రశ్నించింది. 4 వారాలలోపు కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రణాళికతో వస్తామని సుప్రీంకు తెలిపారు

# రైతులు నష్టపోకూడదని ప్రభుత్వ ధ్యేయం: సీఎం జగన్



తాడేపల్లి: ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లో పరిహారం అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా మంగళవారం రబీలో నష్టపోయిన మొత్తం 34,586 మంది రైతులకు రూ.22 కోట్లను వారి ఖాతాల్లో సీఎం జగన్ జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. రైతుల కోసం మరో అడుగు ముందుకు వేస్తున్నామని అన్నారు. మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని, రైతులు ఇబ్బంది పడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో 62 శాతం జనాభా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. అలాంటి రైతు ఇబ్బందిపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రోడ్డుమీద పడుతుందని సీఎం తెలిపారు. ఇది తెలిసి కూడా గతంలో ఎప్పుడూ కూడా ఇంతగా ఆలోచన చేయలేదని, రైతును చేయిపట్టి నడిపించే విధంగా ఎవరూ చేయలేదన్నారు. ఇవాళ తాము తీసుకుంటున్న చర్యలు చరిత్రలో నిలిచిపోతాయని, రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా తోడుగా ఉండాలని మనసా, వాచా, కర్మేణా ప్రతి అడుగూ ముందుకు వేస్తున్నామని సీఎం తెలిపారు. తుపానులు, వరదలు, కరువు ఏవి వచ్చినా సరే రైతు నష్టపోయే పరిస్థితి రాకూడదని, ఒక వేళ వచ్చినా అదే సీజన్ ముగిసే లోగా పరిహారం అందిస్తున్నామని సీఎం తెలిపారు. రైతుకు మళ్లీ పెట్టుబడి అందేలా చేస్తున్నామని, ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి అదే సీజన్‌లో పరిహారాన్ని చెల్లించే కొత్త సాంప్రదాయాన్ని రాష్ట్రంలో తీసుకు రావడం జరిగిందని సీఎం జగన్ పేర్కొన్నారు. పూర్తి పారదర్శకతతో వారికి పరిహారం చెల్లిస్తున్నామని, నష్టపోయిన ప్రతి రైతుకూ పూర్తి పారదర్శకతతో చెల్లిస్తున్నామని సీఎం చెప్పారు. 2 నెలల క్రితం గులాబ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన 34,586 మంది రైతులకు ఖరీఫ్ సీజన్ ముగిసేలోగా రూ.22 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. రూ.22 కోట్లే కదా అని కొందరు గిట్టవాళ్లు మాట్లాడే పరిస్థితి ఉంటుందని, కాని ఒక కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించామన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్ ముగిసేలోగా కచ్చితంగా ప్రభుత్వం పరిహారం ఇచ్చి తోడుగా ఉంటుందనే విషయాన్ని గుర్తించాలని సీఎం జగన్ అన్నారు. ఈ అంశానికి ప్రాధాన్యత ఇస్తూ ఈ కార్యక్రమం చేస్తున్నామని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండున్నర ఏళ్ల కాలంలో నవంబర్‌లో నివర్ తుపాన్ వచ్చిందని అన్నారు. డిసెంబర్ చివరినాటికి 8.34 లక్షల మందికి 645.99 కోట్ల రూపాయలు నష్టపరిహారం కింద ఇచ్చామని సీఎం జగన్ చెప్పారు. ఎక్కువ, తక్కువ మొత్తం అనేది కాకుండా రైతుకు నష్టం జరిగినా, తుపాను వచ్చినా ఇతరత్రా కష్టం వచ్చినా ప్రభుత్వం రైతుకు తోడుంగా ఉంటుందనే గట్టి సందేశం ఇవ్వాలనే ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. 13.96 లక్షల మంది రైతులకు కేవలం ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.1,071 కోట్ల రూపాయలు ఇచ్చామని తెలిపారు. రెండున్నరేళ్ల కాలంలో రైతులకోసం అనేక చర్యలు తీసుకున్నామని, వైఎస్సార్ రైతు భరోసా కింద అక్షరాల రూ.18,777 కోట్లు నేరుగా రైతుల చేతికి అందించామని చెప్పారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.1674 కోట్లు ఇచ్చామని, ఉచిత పంటల బీమా కింద 3,788 కోట్లు ఇచ్చామని, పగటి పూట నాణ్యమైన విద్యుత్తు కోసం రూ.18వేల కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. ఆక్వా రైతులకు రూ.1505 కోట్ల రూపాయలు కరెంటు సబ్సిడీ ఇచ్చామని ఫీడర్ల కోసం రూ.1700 కోట్లకుపైగా ఖర్చు చేశామని సీఎం తెలిపారు. పంట కొనుగోలులోనూ ఆర్బీకే కేంద్ర బిందువుగా పనిచేస్తోందని చెప్పారు. ధాన్యం సేకరణ కోసం మాత్రమే 2 సంవత్సరాల కాలంలో అక్షరాల రూ.30వేల కోట్లకుపైగా ఖర్చుచేశామని తెలిపారు. పత్తి కొనుగోలు కోసం రూ.1800 కోట్లు వెచ్చించామని, ఇతర పంటల కొనుగోలు కోసం రైతు నష్టపోకుండా రూ.6430 కోట్ల ఖర్చు చేశామని సీఎం జగన్ పేర్కొన్నారు. రైతు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో రూ.2వేల కోట్లతో ప్రకృతి వైపరీత్యాల నిధి పెట్టామని, రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి పెట్టామని సీఎం అన్నారు. ధాన్యం సేకరణకోసం గత ప్రభుత్వం పెట్టిన రూ.960 కోట్ల బకాయిలను చెల్లించామని, ఉచిత విద్యుత్ కింద రూ.9వేల కోట్ల కరెంటు బకాయిలను గత ప్రభుత్వం పెడితే దాన్ని చెల్లించామని తెలిపారు. విత్తన బకాయిలు కూడా కట్టామని, రైతన్నలకు తోడుగా ఉండాలని వ్యవస్థలోకి మార్పులను తీసుకు వస్తున్నామని సీఎం పేర్కొన్నారు. వ్యవసాయ సలహా కమిటీలు ఆర్బీకేల స్థాయి, మండలస్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిల్లో పెట్టామని చెప్పారు.

### మరో మూడు జన్మలెత్తినా మూడు రాజధానులు కట్టలేరు: నారా లోకేష్

అమరావతి: ప్రజా రాజధానిపై ప్రభుత్వాధినేతగా వైఎస్ జగన్‌రెడ్డి విద్వేషపు కుట్రలపై అమరావతి రైతులు, కూలీల పోరాటం 7 వందల రోజులకు చేరిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 30 వేల మంది రైతుల సమస్యగా చిన్నచూపు చూసిన పాలకుల కళ్లు బైర్లు కమ్మేలా . అమరావతి రైతులు చేపట్టిన న్యాయస్థానం టూ దేవస్థానం పాదయాత్ర జనసంద్రాన్ని తలపిస్తోందన్నారు. జగన్‌రెడ్డి ఆయన మంత్రులు మరో మూడు జన్మలెత్తినా మూడు రాజధానులు కట్టలేరన్నారు. ప్రజా రాజధాని కోసం భూములు, ప్రాణాలు తృణప్రాయంగా రైతులు చేసిన త్యాగం నిరుపయోగం కాదని ఆశాభావం వ్యక్తం చేశారు. “అమరావతి కోట్లాది మంది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్ష.. అమరావతి వైపు న్యాయం ఉంది.. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రజలు, రాజకీయ పార్టీల మద్దతు ఉంది.. ఒకే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్–ఒకే రాజధాని అమరావతి మాత్రమే ఉంటాయి..

### కాగ్ అడిగిన డేటా ఇవ్వండి..
# ప్రభుత్వ శాఖలకు మోదీ సూచన



న్యూఢిల్లీ: ఆడిట్ దివస్‌లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగిన కాగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేవలం కొన్ని సంస్థలు మాత్రమే మరింత బలోపేతం అయ్యాయని, మరింత పరిణితి సాధించాయని, సమయంతో పాటు అవి మరింత కీలకంగా మారినట్లు ప్రధాని మోదీ అన్నారు. చాలా వరకు సంస్థలు కొన్ని దశాబ్దాల తర్వాత తమ ఉనికిని కోల్పోతాయని, కానీ కాగ్ మాత్రం వారసత్వంగా మారిందని, ప్రతి జనరేషన్ దాన్ని స్పూర్తిస్తోందని, కాగ్‌పై బాధ్యతలు పెరిగినట్లు ప్రధాని అన్నారు. ఒకప్పుడు అనుమానంతో, భయంతో ఆడిటింగ్‌ను చూసేవారని, కాగ్ వర్సెస్ గవర్నమెంట్ అన్న మైండ్‌సెట్ ఉండేదని, ప్రతి అంశంలోనూ కాగ్ తప్పుల్ని వెతుకుతుందని అధికారులు భావించేవారని, కానీ ప్రస్తుతం ఆ మైండ్‌సెట్ మారిందని, ఈ రోజుల్లో ఆడిట్‌ను కీలకమైందిగా భావిస్తున్నారని ప్రధాని మోదీ తెలిపారు. ప్రభుత్వ పనులను అంచనా వేయడంలో కాగ్ అభిప్రాయాలకు అడ్వాంటేజ్ ఉందని, కాగ్ చేసే సూచనలతో వ్యూహాత్మక పురోగతి జరుగుతుందని, దాన్ని సహకారంగా భావిస్తామని ప్రధాని అన్నారు. పారదర్శకత లేకపోవడం వల్లే గతంలో బ్యాకింగ్ రంగంలో ఎన్‌పీఏలు పెరిగాయని, కానీ తమ ప్రభుత్వం వాస్తవ పరిస్థితిని దేశం ముందు పెట్టిందన్నారు. సమస్యలను గుర్తిస్తేనే పరిష్కారాలు వీలవుతాయన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు కాగ్ అడిగిన సమాచారాన్ని, డాక్యుమెంట్లు, డేటా, ఫైల్స్ ఇవ్వాలన్నారు. ఆర్థికలోటు, ప్రభుత్వ ఖర్చుపై కాగ్ ఆందోళనలను సరైన స్పూర్తితో స్వీకరించామని మోదీ తెలిపారు. శాస్త్రీయ పద్ధతిలో, బలంగా ఆడిట్లు సాగితేనే, వ్యవస్థ స్థిరంగా, పారదర్శంగా తయారవుతుందని ప్రధాని చెప్పారు. మంచి పద్ధతులపై కాగ్ స్టడీ చేయాలన్నారు. డేటానే సమాచారమని, భవిష్యత్తులో డేటానే చరిత్రను శాసిస్తుందని ప్రధాని తెలిపారు.

## ఆ విషయాన్ని సగర్వంగా ప్రకటిస్తున్నాం: సజ్జల

అమరావతి: టీడీపీ శాసన మండలిలో సైందవ పాత్ర పోషించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కోటాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ‘శాసనసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. మా పార్టీ అభ్యర్థుల ఎన్నిక లాంఛనమే అవుతుంది. స్థానిక



సంస్థల కోటాలో ?కూడా 11 మంది పేర్లు ప్రకటించాం. దీంతో శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ బలం 32 మందికి పెరుగుతుంది. 18 మంది బలహీన వర్గాలకు చెందిన వ్యక్తులకు కేటాయించామని సగర్వంగా ప్రకటిస్తున్నాం. అందులో నలుగురు మైనార్టీలు. టీడీపీలో బలహీన వర్గాలకు అన్యాయం జరిగింది. ఆ పార్టీని ప్రజా కోర్టులో ప్రజలు తిరస్కరించారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో బలహీన వర్గాలకు 50 శాతం కేటాయించాం. సోషల్ ఇంజనీరింగ్‌లో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశాం’ అని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.

## 17న ఏపీ కేబినెట్ సమావేశం



అమరావతి: రాష్ట్ర కేబినెట్ సమావేశం ఈ నెల 17న బుధవారం జరుగనుంది. అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులపై కేబినెట్‌లో తీర్మానం చేసే అవకాశం ఉంది. ఎల్లుండి ఒక్క రోజు ఏపీ అసెంబ్లీ సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. డిసెంబర్‌లో మరోసారి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది. మండలి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను డిసెంబర్‌లో నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### ఏపీ ఇంధన శాఖ కార్యదర్శికి పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్ లేఖ

అమరావతి: ఏపీ ఇంధన శాఖ కార్యదర్శికి పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్ లేఖ రాశారు. విద్యుత్ కొనుగోళ్లు, సెకీతో ఒప్పందాలపై ప్రస్తావిస్తూ ఆయన లేఖ రాశారు. సెకీతో ఒప్పందంపై అభ్యంతరాలకు ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు.



విద్యుత్ సంస్కరణల ప్రధాన లక్ష్యం దెబ్బతినేలా పబ్లిక్ సర్వెంట్‌గా ఉన్న మీరు ఎలా నిర్ణయాలు తీసుకుంటున్నారని లేఖలో పేర్కొన్నారు. గ్రిడ్‌లో 100 శాతం కంటే అదనపు సామర్థ్యాన్ని ఎందుకు జోడిస్తున్నారని అన్నారు. బిడ్డింగ్ జరపకుండా సెకీ ఆఫర్‌ను ఏకపక్షంగా ఎందుకు అంగీకరించారని పేర్కొన్నారు. రాజకీయ పెద్దల సూచనలకు సివిల్ సర్వీసు అధికారి తలొగ్గినట్లు కనిపిస్తుందన్నారు. ప్రతిపాదనలు, సంప్రదింపులు, ఒప్పందాల్లో ఈ స్థాయి వేగం వెనుక కారణాలెందుకు స్పష్టం చేయడం లేదని లేఖలో పేర్కొన్నారు.


# కుప్పంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది

### ఎస్ఈసీ నీలం సాహ్నీ



విజయవాడ: కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణపై రాష్ట్ర ఎన్నికల అధికారి నీలం సాహ్నీ స్పందించారు. ఈ మేరకు మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. వెబ్‌కాస్టింగ్, వీడియో గ్రఫీ, సీసీటీవీ కెమెరాల నిఘాలో పోలింగ్ జరిగిందని నీలం సాహ్నీ పేర్కొన్నారు. కుప్పంలో పోలింగ్ బూత్ వెలుపల చిన్న చిన్న ఘటనలు మినహాయిస్తే పోలింగ్ ప్రశాం తంగా జరిగిందన్నారు. చిత్తూరు ఎస్పీ కుప్పంలో ఉండి, పరిస్థితిని శాంతిభద్ర తలను స్వయంగా పర్యవేక్షించారని పేర్కొన్నారు. ఎన్నికల పరిశీలకులు ప్రతి బూత్‌కు వెళ్లి పోలింగ్ తీరును స్వయంగా పరిశీలించారని తెలిపారు. పార్టీలు నియమించుకున్న ఏజెంట్లు అంతా పోలింగ్‌బూత్‌ల్లో ఉన్నారని ఎస్ఈసీ నీలం సాహ్నీ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని, రీ పోలింగ్ నిర్వహించమని ఎవరు కూడా కోరలేదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘానికి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు అధికారులకు పంపించినట్లు, వెంటనే చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఎలాంటి చర్యలు తీసుకున్నారో నివేదికలు ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి పంపించారని వెల్లడించారు.

# అంతిమ విజయం ప్రజలదే: చంద్రబాబు



అమరావతి: 700 రోజులకు రాజధాని రైతుల మహోద్యమం చేరిందని ట్విటర్ ద్వారా టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు తెలిపారు. రైతు ఉద్యమంలో భాగంగా న్యాయస్థానం నుంచి దేవస్థానం పేరిట మహా పాదయాత్ర కూడా 16వ రోజుకు చేరుకుందన్నారు. ఉద్యమంలో అమరులైన 189 మంది రైతులకు నివాళులర్పించారు. ఏపీ ప్రజలందరూ అమరావతినే తమ రాజధానిగా కోరుకుంటున్నారని మహా పాదయాత్రకు లభిస్తోన్న మద్దతు చూస్తే తెలుస్తోందని చంద్రబాబు చెప్పారు. ప్రజల ఆకాంక్షలతో తమకు పనిలేదన్నట్టుగా ప్రభుత్వ వైఖరి ఉందని మండిపడ్డారు. రైతుల పాదయాత్రపై ప్రభుత్వం అడుగడుగునా ఆంక్షలు పెడుతోందన్నారు. మద్దతు తెలిపిన ప్రజలపై లాఠీచార్జ్ చేయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత దౌర్జన్యం చేసినా ప్రజల ఆకాంక్షను అణగదొక్కలేరని స్పష్టం చేశారు. అంతిమ విజయం ప్రజలదేనన్నారు.

# సంపాదకీయం

బుధవారం 17 నవంబరు 2021

## కోలుకుంటున్న ఆర్థిక వ్యవస్థలు

కరోనా మహమ్మారి వల్ల గతేడాది మార్చి నుంచి అమల్లోకి వచ్చిన వర్క్ ఫ్రం హోం సంస్కృతి ముగింపు దశకు చేరుకున్నది. ప్రత్యేకించి శరవేగంగా వర్క్ ఫ్రం హోం సంస్కృతిలో భాగమైన ఐటీ సేవల రంగం ఉద్యోగులు ఆఫీసులకు రావడం మొదలైంది. ఉద్యోగులు, యాజమాన్యాలు వర్క్ ఫ్రం ఆఫీసు కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని ఐటీ ఇండస్ట్రీ బాడీ నాస్కామ్, ఓ పోర్టల్ నిర్వహించిన సర్వేలో తేలింది. అదీ కూడా హైబ్రీడ్ మోడల్‌లో అమలు చేయాలన్న అభిప్రాయాలు వస్తున్నాయి. 2022 ప్రారంభం నుంచి సగానికి పైగా ఉద్యోగులు వర్క్ ఫ్రం ఆఫీస్ సేవలందించనున్నారని నాస్కామ్ రిటర్న్ టు వర్క్ ప్లేస్ సర్వేలో తేలింది. అయితే కనీసం వారానికి మూడు వారాలు వర్క్ ఫ్రం ఆఫీస్ పాలసీ అమల్లోకి రాబోతున్నది. 70 శాతం కంపెనీలు హైబ్రీడ్ మోడల్‌కు మొగ్గు చూపుతున్నాయి. ఐటీ సర్వీసెస్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు అతి త్వరలోనే దీర్ఘకాలిక హైబ్రీడ్ వర్క్ మోడల్ అమలుకు ప్రాధాన్యం ఇవ్వబోతున్నాయి. వచ్చే ఏడాది ప్రారంభం నుంచి 50 శాతం సిబ్బందిని ఆఫీసులకు రప్పించేందుకు 72 శాతం సంస్థలు ముందడుగు వేయనున్నాయి. దేశంలోనే అతిపెద్ద ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఈ నెల 15 నుంచి సిబ్బంది తాము నియమితులైన కేంద్రాల్లో ఆఫీసులకు రావాల్సిందిగా కోరింది. అయినప్పటికీ భవిష్యత్‌లో 25/25 మోడల్ అమలు చేయనున్నది. 25/25 ప్రకారం 50 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఆఫీసుకు రావాల్సి ఉంటుంది. 2025 నాటికి 25 శాతం మంది సిబ్బంది మాత్రమే ఆఫీసులకు వస్తారు. ప్రాజెక్ట్ టీమ్స్‌లో మాత్రమే 25 శాతం ఉద్యోగులు ఆఫీసుల్లో విధులు నిర్వర్తిస్తారు. ప్రస్తుతం టీసీఎస్‌లో ఐదు శాతం మంది మాత్రమే ఆఫీసుల్లో సేవలందిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఉద్యోగులందరినీ ఆఫీసులకు రప్పించనున్నది. అటుపై క్రమంగా దశలవారీగా 25/25 మోడల్ అమలు చేయబోతున్నది. మరో ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఉద్యోగులు చైనాలో 91 శాతం మంది ఆఫీసుల నుంచే పని చేస్తున్నారు. భారత్, అమెరికా, బ్రిటన్‌లలో 98.5 శాతం మంది వర్క్ ఫ్రం హోం.. దక్షిణాసియా దేశాల్లో 80 శాతం మంది వర్క్ ఫ్రం హోం సేవలందిస్తున్నారని ఇన్ఫీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ యూబీ ప్రవీణ్‌రావు చెప్పారు. భారత్‌లో సీనియర్ లీడర్లను వారానికొసారి ఆఫీసు రావాలని కోరుతున్నది ఇన్ఫీ. మిడిల్ మేనేజ్మెంట్, 25-40 ఏండ్ల మధ్య వయస్సు గల వారు ఆఫీసులకు వచ్చి విధులు నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నారు. విప్రోలో ప్రపంచవ్యాప్తంగా 85 శాతానికి పైగా సిబ్బంది తొలి డోస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. 50 శాతం మంది రెండు డోస్‌లు వేయించుకున్నారు. భారత్‌లో పూర్తిగా వ్యాక్సిన్ డోస్‌లు వేసుకున్న ఉద్యోగులు ఆఫీసులకు వచ్చి విధులు చేపట్టారు. ఇక నోయిడా కేంద్రంగా పని చేస్తున్న హెచ్సీఎల్‌లో 90 శాతం సిబ్బంది, వారి కుటుంబాల్లో కొందరు పూర్తిగా, కొందరు తొలి డోస్ వ్యాక్సిన్లు వేయించుకున్నారు. ఈ నేపథ్యంలో దశల వారీగా వర్క్ ఫ్రం ఆఫీసు విధానం అమలు చేయబోతున్నది. అయితే ఉద్యోగులను వర్క్ ఫ్రం ఆఫీసు సేవలు అందించాలని ప్రోత్సహిస్తోంది.

# బాబులో కుప్పం టెన్షన్



తిరుపతి, నవంబర్ 16, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబులో నిస్సహాయత కన్పిస్తుంది. అదే సమయంలో ఫ్రస్టేషన్ కూడా పీక్ కు చేరుకుంది. ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నామన్న దైన్యస్థితిలో చంద్రబాబు ఉన్నారు. నిజమే నలభై ఏళ్ల రాజకీయ అనుభవం. మూడు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన చంద్రబాబుకు జగన్ అసలు మింగుడు పడటంలేదు. కొరుకుడు పడటం లేదు. తన వ్యూహాలకు జగన్ చిక్కడమూ లేదు. ఫలితాలు.... కుప్పం మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయనేది మరో రెండు రోజుల తర్వాత కాని తెలియదు. కానీ ఓడిపోతామన్న భయం, బెంగ చంద్రబాబు ముఖంలో స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎన్నికల్లో తాము ఏం చేయలేమన్న భావనకు ఆయన వచ్చేశారు. ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని చంద్రబాబు ఆపసోపాలు పెడుతున్నారు. తాను అధికారంలో ఉండగా చంద్రబాబుకు ప్రజాస్వామ్యం గుర్తుకు రాదు. అలాగే ప్రజలూ ఆయనకు కనపడరు. ప్రజాస్వామ్యం....? ఇప్పుడు ప్రజలంతా రోడ్డెక్కి వైసీపీ ప్రభుత్వాన్ని కూలదోయాలని చంద్రబాబు పిలుపునిస్తుండటం నవ్వు తెప్పిస్తుంది. నంద్యాల ఉప ఎన్నికలో అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ఎలా వ్యవహరించిందో అందరికీ తెలిసిందే. అధికారంలో ఉన్న వారికి అండగా అన్ని వ్యవస్థలు ఉంటాయి. సహకరించని వ్యవస్థను కాదు పొమ్మంటారు కూడా. చంద్రబాబు కాని, జగన్ కానీ ఆ సూత్రంలో మార్పు ఉండదు. పాలకుల మనస్తత్వం కూడా అదే తీరున ఉంటుంది. కానీ అధికారం కోల్పోయినప్పుడే చంద్రబాబుకు అన్ని వ్యవస్థలు గుర్తుకు వస్తాయి. దారులు మూసుకు పోవడంతో.....? చంద్రబాబుకు ఇటు కేంద్రంలో బీజేపీతో కలసి నడిచేందుకు కూడా దారులు దొరకడం లేదు. కనీసం ఆ ప్రయత్నం ఫలించినా జగన్ ను కొంత కట్టడి చేసే అవకాశముండేది. కానీ ఆ ఛాన్స్ కూడా ఇప్పట్లో దొరికేలా లేదు. ప్పంలో పోలింగ్ ముగిసింది. దాదాపు ఎనభై శాతం ఓట్లు నమోదయినట్లు తెలిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం ఒంటి గంటకే అరవై శాతం ఓట్లు నమోదవ్వడం రికార్డు అని చెప్పుకోవాలి. పోలింగ్ సమయం ముగిసే నాటికి క్యూలైన్ లో ఉన్న వారందరికీ అధికారులు అవకాశం కల్పించారు. మొత్తం 12 మున్సిపాలిటీలు, నెల్లూరు కార్పొరేషన్ లకు జరిగిన పోలింగ్ ముగిసింది. అధిక పోలింగ్ ...? కుప్పంలో భారీ పోలింగ్ జరగడం తమకు అనుకూలమేనని అధికార వైసీపీ చెబుతోంది. కానీ విపక్ష తెలుగుదేశం పార్టీ మాత్రం ప్రజలు ప్రభుత్వంపైన ఉన్న వ్యతిరేకతతోనే పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారని చెబుతున్నారు. హుజూరాబాద్ లో కూడా అధిక పోలింగ్ విపక్షానికి లాభించిందన్న లెక్కలు వేస్తున్నారు. వైసీపీ అన్యాయాలను, అరాచకాలను చూసి ప్రజలే స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చారని టీడీపీ నేతలు అంటుండగా, సంక్షేమ కార్యక్రమాలను చూసి పోటెత్తారని వైసీపీ నేతలు చెబుతున్నారు. అందుకే చంద్రబాబు తాను భయపడుతూనే వైసీపీని భయపెట్టే విధంగా వార్నింగ్ లు ఇస్తున్నారు. ఏ ఎన్నికలు జరిగినా పెద్దగా పట్టించుకోని చంద్రబాబు కుప్పం ఎన్నికల విషయంలో మాత్రం ఫ్రస్టేషన్ కు గురవుతున్నారనే చెప్పాలి.

# సింహపురిలో అడ్డగోలు నియామకాలు

### కొనసాగుతున్న రిటైర్ ఉద్యోగుల హవా

నెల్లూరు, నవంబర్ 16, (న్యూస్ పల్స్)విక్రమ సింహపురి యూనివర్సిటీ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. పాలన వ్యవహారాలు, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత పాటించాల్సిన ఉన్నతాధికారులే అక్రమ బాట పట్టారు. అవుట్‌సోర్సింగ్ కింద నియమితులైన విశ్రాంత ఉద్యోగుల కనుసన్నల్లోనే విక్రమ సింహపురి యూనివర్సిటీ పాలన, వ్యవహారాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ప్రధానంగా నాన్ టీచింగ్‌లో పనిచేస్తున్న విశ్రాంత ఉద్యోగులు వర్సిటీ వీసీతో పాటు రిజి?రస్ట్రార్లను శాసిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వర్సిటీ అడ్మిని?రస్టేషన్లో వీరి పాత్ర ప్రముఖంగా ఉంటుంది. వీరు చెప్పిందే అక్కడ జరుగుతోంది. వీరికి గత ప్రభుత్వ పెద్దల అండదండలు పుష్కలంగా ఉండటంతో యూనివర్సిటీలో చక్రం తిప్పారు. వీరితో పాటు టీచింగ్ కేటగిరీల్లో ఉన్న మరో ఇద్దరు ఉద్యోగులు కూడా వర్సిటీ పాలన వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయియూజీసీ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నియామకాలు చేపట్టారు. అధ్యాపకుల కొరత ఉన్న చోట రిటైర్డ్ ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాలనే ఆదేశాలను పక్కదోవ పట్టించారు. అర్హత లేకపోయినా అప్పటి ప్రభుత్వ పెద్దలు, వర్సిటీ ఉన్నతాధికారులు కలిసి తమకు ఇష్టమున్న వారిని అవుట్‌సోర్సింగ్ కింద నియమించారు. ఈ తరుణంలో అక్రమ మార్గంలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకాలు పొందిన రిటైర్డ్ ఉద్యోగుల ఉద్వాసనకు నూతన ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 18న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇది జరిగి నెల కావస్తున్నా వర్సిటీ ఉన్నతాధికారులు వారిని తొలగించేందుకు ఇష్టపడటం లేదు. వారి అస్మదీయులను కాపాడుకునేందుకే ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వర్సిటీలో నియామకాలు చేపట్టాలంటే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలి. వర్సిటీలో ఏయే పోస్టులకు నియామకాలు చేపట్టనున్నారో బహిరంగ ప్రకటన ఇవ్వాల్సి ఉంది. దీన్ని వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి. అర్హులను గుర్తించి వారిని విధుల్లోకి తీసుకోవాలి. అయితే విక్రమ సింహపురి వర్సిటీలో ఈ నిబంధనలను పాటించకుండా అడ్డగోలుగా నియామకాలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ పెద్దలు, వర్సిటీ ఉన్నతాధికారులు కలిసి తమ అనుయాయులను నియమించుకున్నారు. వర్సిటీలో బోధనకు విశ్రాంత ఉద్యోగులను తీసుకోవాలని ఇచ్చిన జీఓను పక్కదారి పట్టించారు. సాధారణంగా వర్సిటీలో బోధనకు విశ్రాంత ప్రొఫెసర్లను తీసుకోవాల్సి ఉంది. అయితే అప్పటి ఉన్నతాధికారులు కేవలం డిగ్రీ అధ్యాపకులుగా పనిచేస్తూ రిటైరైన వారిని వర్సిటీలోకి తీసుకున్నారు. వీరిలో 70 ఏళ్లు పైబడిన వారూ ఉండటం గమనార్హం. దీంతో పాటు భార్య, భర్తలకు అర్హత లేకపోయినా అవుట్‌సోర్సింగ్ కింద అప్పటి వర్సిటీ ఉన్నతాధికారులు విధుల్లోకి తీసుకున్నారు. వర్సిటీలో ప్రస్తు తం 15 మంది వరకు ఉన్నట్లు సమాచారం. కేవలం ఇద్దరు, ముగ్గురు మాత్రమే విశ్రాంత ప్రొఫెసర్లు ఉన్నారని తెలిసింది. వీరితో పాటు నాన్ టీచింగ్ కింద నిబంధనలను పాటించకుండా నియమించారు. వీరు ప్రతి నెలా పింఛన్‌తో పాటు యూనివర్సిటీ నుంచి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనం పొందుతున్నారు. అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న విశ్రాంత టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయినా నేటికీ విక్రమ సింహపురి యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఈ విషయమై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వర్సిటీ ఉన్నతాధికారులకు సంబంధించిన వ్యక్తులు కావడంతో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపులో తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తున్నారు.

# కర్నూలులో ఇసుక మూట రూ.300



కర్నూలు, నవంబర్ 16, (న్యూస్ పల్స్)ఇసుక బంగారంగా మారిన ప్రస్తుత తరుణంలో కర్నూలు జిల్లా ఆదోనిలో రజకులు గాడిదలపై తరలిస్తూ లాభాలు గడిస్తున్నారు. ఇసుకపై నిషేధం కొనసాగుతున్నందున పెద్దమొత్తంలో దొరకడం దుర్లభమైంది. దీంతో ఆదోనిలో కొంతమంది రజకులు సమీపంలోని కాలువలు, నదుల నుంచి గాడిదలపై ఇసుక తెచ్చి పట్టణంలో విక్రయిస్తున్నారు. మధ్యలో పనులు ఆగిపోయిన భవన యజమానులు తప్పినిసరి పరిస్థితుల్లో ఈ ఇసుక కొనుగోలు చేస్తున్నారు. గాడిదలపై తెచ్చే ఇసుకను రూ.300కు విక్రయిస్తున్నారు. గతంలో రూ.150కే అమ్మేవారు. అయితే ప్రస్తుతం బయట ఇసుక దొరక్కపోవడంతో గాడిదల ఇసుకకు డిమాండ్ పెరిగింది. వాహనాల్లో ఇసుక తరలింపుపై ప్రభుత్వం అంక్షలు పెట్టడం, ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని భారీ మొత్తంలో జరిమానా విధిస్తుండడంతో ఆదోని పట్టణంలో గాడిదలపై ఇసుక రవాణా చేస్తూ భవన నిర్మాణాలను సాగిస్తున్నారు. గాడిదలపై తెచ్చే ఇసుక కొనుగోలు చేయడం వల్ల భవన యజమానులకు అధిక భారం అవుతోంది. అయినప్పటికీ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవడానికి తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సి వస్తోందంటున్నారు. ఇసుక తరలింపుపై ప్రభుత్వం అంక్షలు పెట్టింది. ఆదోని పట్టణ సమీపంలో ఇసుక రీచ్‌లను ప్రభుత్వం గుర్తించలేదు. దీంతో ఆదోని పట్టణంలో ఇసుక కావాలంటే అక్కడకక్కడ ఉన్న వంకలు, వాగులు, చెరువుల నుంచి గాడిదలపై ఇసుక తెచ్చి విక్రయిస్తున్నారు. ఆదోనిలో గాడిదపై ఇసుక విక్రయాలు ఈనాటివి కావు. గతంలో ఎర్రమట్టి, ఇసుక గాడిదలపై వేసుకుని ఇళ్లిల్లా తిరిగి విక్రయించేవారు. ట్రాక్టర్లు రావడంతో వీటికి గిరాకీ తగ్గింది. అయితే ఇప్పుడు ట్రాక్టర్లు మూలనబడడంతో గాడిదపై తెచ్చే ఇసుకకు డిమాండ్ పెరిగింది. గతంలో ఒక గాడిదపై తెచ్చే ఇసుక రూ.150కు అమ్మగా ఇప్పుడు ఏకంగా రూ.300కు విక్రయిస్తున్నారు.

# పదవులు సరే... సీట్లు ఏవీ

రాజమండ్రి, నవంబర్ 16, (న్యూస్ పల్స్)పదవి వచ్చిన మూడు నెలలకే ఆయన మూడ్ ఆఫ్ అయింది. ఛైర్మన్ పోస్ట్ ఉన్నట్టా.. లేనట్టా అని ఒక్కటే అనుమానం. కనీసం కుర్చీ కూడా లేదు. దీంతో లబోదిబోమంటున్నారట ఆ నాయకుడు. ఆయనెవరో.. ఆ కథేంటో ఇప్పుడు చూద్దాంరాజమండ్రి స్మార్ట్ సిటీ ఛైర్మన్‌గా వైసీపీ నేత చందన నాగేశ్వర్‌ను నియమించి మూడు నెలలైంది. ఇంతవరకు ఆయన బాధ్యతలు చేపట్టలేదు. ఇందుకు కారణం పదవి ఇష్టం లేక కాదు.. పదవి ఇచ్చారు కానీ కుర్చీ కేటాయించలేదు. స్మార్ట్ సిటీ ఛైర్మన్‌కు కుర్చీ ఎక్కడ వేయాలనేది చర్చగా మారింది. రాష్ట్రంలో అన్ని స్మార్ట్ సిటీ ఛైర్మన్ల పేర్లతో చందన పేరును అధికారికంగా ప్రకటించారు. ఆ జాబితాలో ఉన్నవారిలో చందన తప్ప మిగతావారంతా బాధ్యతలు చేపట్టేశారు కూడా. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీగా రాజమండ్రిని గుర్తించలేదు. స్మార్ట్ సిటీని చేయాలనే డిమాండ్ ఉంది. అన్ని పక్షాలు ఈ డిమాండ్‌ను తమ అజెండాలో చేర్చుకున్నాయి. ఎంపీ భరత్‌రామ్ ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్రం రాజమండ్రిని స్మార్ట్ సిటీని చేస్తుందని.. అదిగో..ఇదిగో అంటూ ఎదురు చూడటమే సరిపోతోంది. ఢిల్లీ నుంచి ఎలాంటి ఉలుకు.. పలుకు లేకపోయినా.. స్మార్ట్ సిటీ కాని రాజమండ్రికి చందన నాగేశ్వర్ ఛైర్మన్ అయ్యారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడానికి సాంకేతిక అంశాలు అడ్డుగా మారాయి. అసలు లోగుట్టు ఇలా ఉంటే.. స్మార్ట్ సిటీ ఛైర్మన్ హోదాలో చందన నాగేశ్వర్‌కు రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌లోని డిప్యూటీ మేయర్ ఛాంబర్‌ను కేటాయించాలని కమిషనర్‌పై ఒత్తిళ్లు వస్తున్నాయట. 3 నెలలుగా ఈ విషయం ఎటూ తేలడం లేదు. పదవి దక్కినా.. అది ప్రకటనకు పరిమితం కావడం.. కుర్చీ లేకపోవడంతో చందన మూడ్ ఆఫ్ అయినట్టు సమాచారం. స్మార్ట్ సిటీ ఛైర్మన్ పదవి ఉంటుందా? లేక రద్దు చేస్తారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయట. సమస్యలతో కునారిల్లుతున్న రాజమండ్రి వైసీపీని గాడిలో పెట్టేందుకు చందన నాగేశ్వర్‌కు నామినేటెడ్ పదవి ఇచ్చి చికిత్స చేయాలని చూశారు. ఇప్పటికే ఇద్దరు వైసీపీ కోఆర్డినేటర్లు మారారు. మూడో కో ఆర్డినేటర్‌గా మాజీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ వచ్చారు.

# వైసీపీ గూటికి సంచయిత



విజయనగరం నవంబర్ 16, (న్యూస్ పల్స్)న్న వయసు. పెద్ద పదవి. రాష్ట్ర రాజకీయాలను ఒక ఊపు ఊపిన యువతి ఆమె. కానీ గత కొన్నాళ్లుగా ఆమె కన్పించకుండా పోయారు. సంచయిత గజపతి రాజు ఇప్పుడు ఏమైపోయారన్నది ప్రశ్నగా ఉంది. దాదాపు ఏడాది పాటు హల్ చల్ చేసిన సంచయిత చివరకు రాజకీయాలకు దూరంగా ఉండటమే మంచిదని నిర్ణయించుకున్నట్లుంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను చూసిన సంచయితకు మైండ్ బ్లాంక్ అయిపోయిందని అనుకుంటున్నారు. రెండేళ్ల ముందు వరకూ.... సంచయిత గజపతిరాజు రెండేళ్ల ముందు వరకూ ఎవరికీ పెద్దగా తెలియదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమె పేరు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. నిత్యం బ్రేకింగ్ న్యూస్ గా మారిన సంచయిత ఇప్పుడు బ్రేక్ తీసుకున్నట్లే కనపడుతుంది. మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ గా, సింహాచలం దేవస్థానం ఛైర్ పర్సన్ గా సంచయిత వ్యవహరించి ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చారు. రాజుగారి కూతురా? మజాకా? అంటూ దర్పాన్ని ప్రదర్శించారు. పదవులు పోవడంతో... కానీ న్యాయస్థానం తీర్పుతో సంచయిత పదవి ఊడిపోయింది. తిరిగి చిన్నాన్న అశోక్ గజపతి రాజు మాన్సాస్ ట్రస్ట్ ను చేజిక్కించుకున్నారు. సంచయిత తొలుత బీజేపీలో చేరారు. బీజేపీ అయినా అశోక్ గజపతి రాజును దెబ్బకొట్టేందుకు వైసీపీ ప్రభుత్వం సంచయితకు అండగా నిలిచింది. కీలకమైన పదవులను ఆమెకు అప్పగించింది. కానీ అశోక్ గజపతిరాజు న్యాయస్థానాన్ని ఆశ్రయించి సంచయితను బయటకు పంపారు. వైసీపీలో చేరతారా? ఇప్పుడు సంచయిత న్యాయ పోరాటం చేస్తున్నారు. కానీ ఆమె పోరాటం ఫలించేటట్లు లేదు. బీజేపీలో ఉన్నా ఆమెకు ఒరిగేదేమీ లేదు. అందుకే సంచయిత వైసీపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. విజయనగరం జిల్లాలో అశోక్ గజపతి రాజును ఎదుర్కొనేందుకు సంచయిత అవసరం వైసీపీకి కూడా ఉంది. సంచయిత కూడా బాబయిపై యుద్ధం చేయడానికి వైసీపీ లో చేరడమే బెటర్ అని భావిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ నుంచి ఆఫర్ లభించకపోతే రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు సమచారం.

# వారం లో భారీగా పెరిగిన కోడి



గుంటూరు, నవంబర్ 16, (న్యూస్ పల్స్)కోడిమాంసం ధర ఒక్క వారంలోనే కిలోకి రూ. 50 పెరిగింది. గత వారం కిలో స్కిన్‌లెస్ రూ. 130కి లభించగా నేడు కిలో రూ. 180కి చేరింది. కూరగాయల ధరలూ పెరిగాయి. ఉల్లి ధర ఘాటు మళ్లీ కంటతడి పెట్టిస్తోంది. రైతుబజార్లలో ఉల్లిపాయలు కిలో రూ. 35కి అమ్ముతున్నా గానీ నాసిరకం దొరుకుతున్నాయి. గోలీకాయలంత సైజుల్లో ఉంటున్నాయని వినియోగదారులు విలవిల్లాడుతున్నారు. గతంలో మాంసం ధరలు పెరిగితే కూరగాయల ధరలు అందుబాటులోకి వచ్చేవి. కానీ నేడు మాంసం, కూరగాయల ధరలు రెండూ పోటీపడి పెరగడంతో వినియోగదారులు ఆర్థిక భారంతో అల్లాడుతున్నారు. కార్తీక మాసంలో పూజలూ, నోములు ఉండగా మాంసాహారులు కూడా శాకాహారులుగా మారుతుంటారు. అలాంటి తరుణంలో కూరగాయల వినియోగం పెరుగుతుంది. కూరగాయల వ్యాపారులు, రైతుల పంట పండుతుంది. గత నెల రెండోవారంలో టమాటా కిలో రూ. 23లకే లభించగా ఈ నెల 6న కిలో రూ. 30కి రైతుబజారులో అమ్ముతున్నారు. అదే బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 40కి అమ్ముతున్నారు. బంగాళదుంపలు కిలో రూ. 18 నుండి నేడు రూ. 23కి చేరాయి. నాటు బీరకాయలు కిలో రూ. 28 నుండి రూ. 38కి పెరిగాయి. గత నెల దొండకాయలు కిలో రూ. 26లకే లభించగా నేడు రూ. 37కి చేరాయి. కాకరకాయలు కిలో రూ. 18 నుండి రూ. 22కి పెరిగాయి. గోరుచిక్కుళ్లు కిలో రూ. 18 నుండి రూ. 22కి, పచ్చిమిరపకాయలు మాత్రం కిలో రూ. 18 నుండి తగ్గి రూ. 15లకే లభిస్తున్నాయి. అలాగే వంకాయల ధరలు తగ్గి అందుబాటులోకి వచ్చాయి. కిలో రూ. 32 అమ్మిన వంకాయలు నేడు రూ. 26కి అందుబాటులోకి వచ్చాయి. చామదుంప మాత్రం కిలో నిలకడగా రూ. 28లకే లభిస్తున్నాయి. బీట్‌రూట్ కూడా ధర కిలో రూ. 28 నుండి రూ. 37కి చేరాయి. క్యారెట్ కిలో రూ. 48 నుండి రూ. 58కి ధర పెరిగాయి. ఫ్రెంచి బీన్స్ ధరలు మాత్రం కిలో రూ. 52 నుండి రూ. 34కి తగ్గాయి. కీరదోస కూడా అందుబాటులోకి వచ్చింది. కిలో రూ. 32 నుండి రూ. 18కి చేరింది. నిత్యం వాడకం ఎక్కువగా ఉండే టమాటా, ఉల్లిపాయల ధరలు పెరిగాయి. ఉల్లిపాయలు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 60 నుండి రూ. 65కి ధర పెరిగింది.

# అమ్మ ఒడి... న్యూ కండిషన్స్

నెల్లూరు, నవంబర్ 16, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులకు జగన్ సర్కారు బిగ్ అలర్ట్ ఇచ్చింది. అమ్మఒడి పథకానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. అమ్మ ఒడి పథకం రావాలంటే 75 శాతం హాజరు తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా, ఆన్‌లైన్‌లో ఈ హాజరు వివరాలు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. యాప్‌లో ప్రతి రోజూ విద్యార్థుల హాజరు నమోదు చేయాలని స్పష్టం చేసింది. అమ్మ ఒడి పథకానికి ఈ నెల 8వ తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు ఉండే హాజరును ప్రామాణికంగా తీసుకోనున్నారు. అయితే, కరోనా నేపథ్యంలో దీనిపై వ్యతిరేకత వస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం.. నవంబర్ 8వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 23వ తేదీ వరకు 130 రోజుల పని దినాలు ఉంటాయి.

# వైసీపీలో అసంతృప్తి జ్వాల

విశాఖపట్టణం, నవంబర్ 16, (న్యూస్ పల్స్)ఒకప్పుడు చక్రం తిప్పిన ఆ మాజీ మంత్రికి ఓ జూనియర్ ఎమ్మెల్యే వర్గం చెక్ పెడుతోంది. 30 ఏళ్ల అనుభవంలో ఎన్నడూ చూడని పరిణామాలు సీనియర్ నేతలో అసంతృప్తి జ్వాలలు రగిలించాయ్. వర్గ రాజకీయాలతో విసిగెత్తిపోయిన ఆయన ఎక్కువ కాలం భరించడం కష్టం అనుకున్నారో ఏమో కానీ?కుండబద్దలు కొట్టేశారు. నాకు సీఎం తప్ప బాస్‌లు ఎవరూ లేరని బహిరంగంగానే ప్రకటించి సరికొత్త చర్చకు తెరతీశారు.విశాఖ జిల్లా అనకాపల్లి వర్గ రాజకీయాలకు పెట్టింది పేరు. ఇక్కడ మాజీ మంత్రులు కొణతాల రామకృష్ణ, దాడి వీరభద్రరావు బలమైన రాజకీయ ప్రత్యర్థులు. నాలుగు సార్లు ఎమ్మెల్యే గా, మంత్రిగా, శాసనమండలి ప్రతిపక్ష నేతగా పని చేసిన అనుభవం వీర భద్రరావుకి ఉంది. ఎప్పుడూ రాజకీయంగా ప్రత్యర్థితోనే పోరాటం చేసిన దాడికి తొలిసారి వింతైన అనుభవం సొంత పార్టీ నుంచే ఎదురవుతోంది. అధికార పార్టీకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఆయనకు సిట్టింగ్ ఎమ్మెల్యే అమర్నాథ్‌కు మధ్య గ్యాప్ ఉందనేది బహిరంగ రహస్యమే.ఐతే?ఇటీవల ఆ దూరం బాగా పెరిగిపోవడమే కాదు?ఒకరి వర్గంను మరొకరు టార్గెట్ చేసుకునే స్థాయికి చేరింది. ఈనేపథ్యంలో పార్టీ కార్యక్రమాలకు మాజీ మంత్రిని ఆహ్వానించకుండా పక్కన పెట్టేసిందట ఎమ్మెల్యే గ్రూప్. తమతో కలిసి రావడం లేదని హైకమాండ్‌కు చెప్పేందుకు ఇలా కుట్ర చేస్తున్నారని దాడి వర్గం భావిస్తోంది. ఇటీవల నెహ్రూ చౌక్‌లో చేపట్టిన జనాగ్రహ దీక్షకు పిలవని పేరంటమే అయినా దాడి వెళ్లివచ్చారు. దీనికి కారణం ఉందట. చంద్రబాబుకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్యక్రమానికి వెళ్లకపోతే టీడీపీకి తాను అనుకూలం అనే ప్రచారం చేస్తారనే అనుమానంతోనే వెళ్లారట. జగన్ పాదయాత్రకు నాలుగేళ్లు అయిన సందర్భంగా ఎమ్మెల్యే వర్గం, దాడి గ్రూప్ వేరు వేరుగానే ర్యాలీలు నిర్వహించాయి.ఐతే..ఇలా చూస్తూ వదిలేస్తే ఎమ్మెల్యే వర్గం రాజకీయంగా దెబ్బ తీయవచ్చనే అనుమానం దాడిలో కనిపిస్తుందట. అందుకే ఎమ్మెల్యే వర్గం పిలిచినా..పిలవకపోయినా..కార్యక్రమాలకు వెళ్లటంతో పాటు..తనకు ఎమ్మెల్యేలకు మధ్య గ్యాప్ లేదనే విషయాన్ని బహిర్గతం చేయటం ద్వారా..ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నది దాడి ప్లాన్ అట.ఇక?అదే వేదికపై నుంచి దాడి వీరభద్రరావు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. తనకు సీఎం ఒక్కరే బాస్ అని జగన్ నాయకత్వంలో మాత్రమే పనిచేస్తానని కుండ బద్దలు కొట్టేశారు. తద్వారా ఎమ్మెల్యే అమర్నాథ్‌ను పట్టించుకోవాల్సిన అవసరం తమకు లేదనే సంకేతాలు పంపించారు వీరభద్రరావు. ఈ పరిణామాల వెనుక పవర్ పాలిటిక్స్ కారణం అనేది అనకాపల్లి గురించి తెలిసిన వారికి ఇట్టే అర్థం అవుతుంది.

# నల్గొండలో ఇసుక దందా



నల్గొండ, నవంబర్ 16, (న్యూస్ పల్స్)నల్లగొండ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా హైసెక్యూరిటి నెంబర్ ప్లేట్‌లు లేకుండా వాహనాలు తిరుగుతున్న జిల్లా రవాణా శాఖా అధికారులు వాటిపై దృష్టి సారించడం లేదు. జిల్లా వ్యాప్తంగా వందలాది వహనాల యజమానులు నెంబర్ ప్లేట్‌లు లేకుండా తమ వాహనాలలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న పట్టించుకునే దిక్కు కనిపించడం లేదు. అందేకాదు పదిహేను, పదహారు సంవత్సరాల వయ స్సు కలిగిన పిల్లలు లైసెన్సులు లేకుండానే ఇసుకను అక్ర మంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న రవాణా శాఖ అధి కారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలలోని వాగులు, నదులు, వంకల నుంచి రోజు వందలాది ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది.ప్రధానంగా మూసి, కృష్ణ నదులతో పాటు హాలియా వాగుల నుంచి ఇసుక అక్రమ తరలింపు యాథే చ్ఛగా సాగుతోంది. ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్‌ల ద్వారా తరలిస్తున్న అక్రమార్కులు తమ వాహ నాలకు రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్‌లు లేకుండానే నడుపుతూ, తమ వాహనాన్ని అధికారులు గుర్తించకుండా భద్రతా చర్యలను తీసుకుంటున్నారు. ఆయా ట్రాక్టర్లకు అడ్డుకట్ట వేసేందుకు రవాణా శాఖ అధికారులు దృష్టిని సారించుకు న్నప్పటికీ స్థానిక పోలీసులు సైతం ఈ విషయాన్ని ఎంత మాత్రం పట్టించుకోవడం లేదు. ఇసుక అక్రమ రవాణా దారుల నుంచి నెలనెలా మామూళ్లు దండు కుంటున్న నేప థ్యంలోనే సంబంధిత ట్రాక్టర్ల యాజమా న్యాలపై పోలీ సులు చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శ లు వినిపిస్తున్నాయి. కృష్ణానది నుంచి దేవరకొండ, హాలి యా, పెద్దవూర, దామరచర్ల, నేరేడుచర్ల, మఠంపల్లి, మేళ్ళ చెర్వు మండలాలకు పెద్ద ఎత్తును ఇసుక ఆక్రమ రావాణా నిరంత రాయంగా జోరుగా సాగుతోంది.మూసీ నుంచి భూదాన్ పోచంపల్లి, అర్వపల్లి, సూర్యాపేట, వేములపల్లి, మిర్యాల గూడ తదితర మండలాలకు నిబంధనలకు విరు ద్ధంగా అక్రమార్కులు ఇసుక రవాణా చేస్తున్నారు. పాలేరు వాగు నుంచి మోతే, నడిగూడెం, కోదాడ మండలాలతో పాటు ఖమ్మం జిల్లా కూసుమంచి, ఖమ్మం మండలాలకు ఇసు కను అక్రమార్కులు ట్రాక్టర్లలో తరలిస్తూ జేబులు నింపు కుంటున్నారు.

# పెరుగుతున్న దూరం...

శ్రీకాకుళం, నవంబర్ 16, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ అచ్చెన్నాయుడు పార్టీ వ్యవహారాల పట్ల సంతృప్తికరంగా లేరు. తనను కొన్ని పనులకే అధినాయకత్వం వాడుకుంటుందని భావిస్తున్నారు. తిరుపతి ఉప ఎన్నికల నాటి నుంచి అచ్చెన్నాయుడుకు అంత ప్రయారిటీ పార్టీలో లభించడం లేదు. ముఖ్యమైన నిర్ణయాల్లో ఆయనను ఇన్ వాల్వ్ చేయడం లేదు. పార్టీ నేతలు కూడా అచ్చెన్నాయుడుతో దూరం మెయిన్ టెయిన్ చేస్తుండటం టీడీపీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. అప్పటి నుంచే....? అచ్చెన్నాయుడు తిరుపతి లో లోకేష్ గురించి చేసిన వ్యాఖ్యలతో ఆయనకు అధినాయకత్వం దగ్గర ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. కొన్ని ప్రకటనలు మాత్రమే అచ్చెన్నాయుడు చేత చేయిస్తున్నారు. మరోవైపు ఆయన జిల్లాలను పర్యటించాలనుకుంటున్నా అనుమతి లభించడం లేదు. మొన్నా మధ్య అనంతపురంలో విద్యార్థులపై లాఠీ ఛార్జిని నిరసిస్తూ అచ్చెన్న అక్కడకు వెళ్లాలనుకున్నారట. కానీ అధినాయకత్వం మాత్రం అందుకు అంగీకరించలేదు. స్థానిక సంస్థల ఎన్నికలకు.... తీరా అక్కడకు లోకేష్ ను పంపించారు. ఇక స్థానిక ఎన్నికల విషయంలోనూ అచ్చెన్నాయుడును దూరంగానే ఉంచారని తెలిసింది. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా అచ్చెన్నాయుడు అక్కడకు వెళదామనుకున్నా వీలుకాలేదు. ఏ ఎన్నికలకూ అచ్చెన్నను దూరంగానే అధినాయకత్వం ఉంచినట్లు తెలిసింది. కుప్పం నియోజకవర్గానికి కూడా చంద్రబాబు తనకు నమ్మకమైన నేతలను మాత్రమే పంపారు. అందుకే జిల్లాలోనే.... దీంతో అచ్చెన్నాయుడును చంద్రబాబు దూరంగా ఉంచుతున్నారన్న టాక్ పార్టీలో బాగానే విన్పిస్తుంది. చంద్రబాబు 36 గంటల దీక్ష సమయంలోనూ అచ్చెన్నాయుడుకు ఆయన పెద్ద ప్రయారిటీ ఇవ్వలేదని, మిగిలిన నేతలతో మాట్లాడినట్లు అచ్చెన్నతో సరిగా మాట్లాడలేదని పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు.

# కుప్పం కోసం తహ తహ

తిరుపతి, నవంబర్ 16, (న్యూస్ పల్స్)ఒక మున్సిపాలిటీ... తిప్పి తప్పి కొడితే 40 వేల మంది ఓటర్లు లేరు. అయినా ఎందుకీ హడావిడి? ఎందుకీ తాపత్రయం? అధికార, విపక్ష పార్టీలు కుప్పం మున్సిపాలిటీ ఎందుకింత పట్టుదలకు పోతున్నాయి? రాష్ట్రంలో 12 మున్సిపాలిటీలకు, నెల్లూరు కార్పొరేషన్ కు ఎన్నికలు జరుగుతుండగా కుప్పంలోనే ఎందుకింత టెన్షన్ ఉంది. కావాలనే చేస్తున్నారా? లేక సానుభూతిని పొందే ప్రయత్నమా? ఒక్క మున్సిపాలిటీతో పోయేదేమిటి? వచ్చేదేమిటి? సొంత నియోజకవర్గం కావడంతో... కుప్పం మున్సిపాలిటీ చంద్రబాబు సొంత నియోజకవర్గంలో ఉండటమే ఇందుకు కారణం. చంద్రబాబు ఈ ఎన్నికను తొలి నుంచి సీరియస్ గా తీసుకున్నారు. ఆయన రెండు రోజుల పాటు నోటిఫికేషన్ కు ముందే పర్యటించి తనకు మద్దతివ్వాల్సిందిగా ప్రజలను కోరారు. క్యాడర్ లో ధైర్యాన్ని నింపారు. అభ్యర్థులకు అన్ని రకాలుగా ఉంటానని హామీ ఇచ్చి వచ్చారు. ఆ తర్వాత నారా లోకేష్ సయితం కుప్పంలో రెండు రోజుల పాటు పర్యటించి ప్రచారం చేసి వచ్చారు. ప్రతిష్టాత్మకంగా తీసుకుని.... ఇక వైసీపీ కూడా ఏమాత్రం తగ్గలేదు. కుప్పం మున్సిపాలిటీపై వైసీపీ జెండా ఎగురవేసి చంద్రబాబును దెబ్బకొట్టాలన్న ప్రయత్నంలో ఉంది. అక్కడ ఇన్ ఛార్జి భరత్ కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. అలాగే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్ రెడ్డిలు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కుప్పంలో ఉన్నవి 25 వార్డులు. అందులో ఒక వార్డు ఇప్పటికే ఏకగ్రీవం అయింది. 24 వార్డులకు జరుగుతున్న ఎన్నికల్లో మొత్తం 87 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వైసీపీ నేతలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని టీడీపీ, చంద్రబాబు డ్రామాలాడుతున్నారని వైసీపీ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. సానుభూతి కోసమేనా? కానీ కేవలం కుప్పం మున్సిపాలిటీ గెలిచినా, ఓడినా రెండు పార్టీలకు ఒరిగేదేమీ ఉండదు. కానీ తెలంగాణలో హుజూరాబాద్ ఉప ఎన్నిక తరహాలో రెండు పార్టీలు పంతానికి, పట్టుదలకు పోవడం వల్లనే సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతి రోజు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రత్యేకంగా ఈ మున్సిపాలిటీ ఫలితంతో ముఖ్యమంత్రి జగన్ కు గాని, విపక్ష నేత చంద్రబాబుకు గాని జరిగే ప్రయోజనం లేదు. ఒనగూరే నష్టమూ లేదు. వైసీపీ నేతలు అరాచకాలు చేస్తున్నారని చెప్పి సానుభూతి తెచ్చుకోవాలని చంద్రబాబు, కుప్పంలో గెలిచి బాబును దెబ్బతీయాలని జగన్ భావిస్తున్నారు. ఇద్దరు అగ్రనేతలకు పట్టుదలకు పోవడంతోనే కుప్పం ఇప్పుడు ఏపీలో హాట్ టాపిక్ గా మారింది.

# శ్రీవారి ఆలయంలో వేడుకగా కైశికద్వాదశి ఆస్థానం

## మాడ వీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి దర్శనం

తిరుమల, నవంబరు 16 కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో మంగళవారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 4.30 నుండి 5.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తిని ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం ఉదయం 5.30 నుండి ఉదయం 7 గం.ల వరకు స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ప్రాశస్త్యం..

పురాణాల ప్రకారం శ్రీవైష్ణవ క్షేత్రాల్లో నిర్వహించే ముఖ్యమైన పర్వదినాల్లో కైశికద్వాదశి ఒకటి. శ్రీ వరాహ పెరుమాళ్ కైశికపురాణంలోని 82 శ్లోకాలతో శ్రీ భూదేవికి కథగా చెప్పిన రోజును కైశిక ఏకాదశిగా పిలుస్తారు. ఈ కథ ఆధారంగా కైశిక ద్వాదశి ప్రత్యేకతను సంతరించుకుంది.నంబదువాన్ కథ... కైశికద్వాదశి పురాణ నేపథ్యం విశేష ఘట్టాలతో కూడుకున్నది. శ్రీనంబదువాన్ (సత్యమూర్తి) అనే భక్తుడు స్వామివారికి కైశిక రాగంలో అక్షరమాలను నివేదించడానికి వెళుతుండగా మార్గమధ్యంలో ఒక బ్రహ్మరాక్షసుడు తారసపడి తినేస్తానన్నాడు. తాను శ్రీవారికి సంకీర్తనార్చన చేయడానికి వెళుతున్నానని తప్పక తిరిగివచ్చి ఆ బ్రహ్మరాక్షసుని క్షుద్బాధను తీరుస్తానని నంబదువాన్ ప్రమాణం చేశాడు. అన్న ప్రకారం స్వామివారికి కైశిక రాగంలో అక్షరమాలను నివేదించి బ్రహ్మరాక్షసుని చెంతకు వచ్చాడు. భక్త నంబదువాన్ భక్తికి, సత్యనిరతికి ముగ్ధుడై స్వామివారు మోక్షం ప్రసాదించారు. ఈ విధంగా ఉత్తానద్వాదశికి కైశికద్వాదశి అనే నామకరణం కలిగింది. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో రమేష్ బాబు, విజివో బాలిరెడ్డి, ఎవిఎస్వో సురేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏకాంతంగా శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

## - టిటిడి జెఈవో వీరబ్రహ్మం

తిరుపతి తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను నవంబరు 30 నుంచి డిసెంబరు 8వ తేదీ వరకు ఏకాంతంగా నిర్వహించనున్నట్లు టిటిడి జెఈవో వీరబ్రహ్మం తెలిపారు. తిరుచానూరులోని ఆస్థాన మండపంలో మంగళవారం జెఈవో వీరబ్రహ్మం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కోవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో భక్తుల ఆరోగ్య భద్రత దృష్ట్యా అమ్మవారి వాహన సేవలు, పంచమి తీర్థం ఆలయ వాహన మండపంలో ఏకాంతంగా నిర్వహించాలని టిటిడి నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జెఈవో మాట్లాడుతూ కోవిడ్ -19ను దృష్టిలో ఉంచుకుని అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆగమ శాస్త్రం, సంప్రదాయ బద్ధంగా ఏకాంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉద్యాన, విద్యుత్ విభాగాల అధికారులు ఆలయం అలంకరణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య సిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శ్రీ పద్మావతి అమ్మవారి వాహనసేవలను ఎస్వీబిసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తామన్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో స్నపన తిరుమంజనం నిర్వహించే రోజుల్లో ఆకర్షణీయమైన మాలలు, పుష్పాలంకరణలు చేపట్టాలని ఉద్యానవన విభాగం అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా విచ్చేసే భక్తులందరికి మూలమూర్తి దర్శనం కల్పించాలన్నారు. అన్నప్రసాదం విభాగం ఆధ్వర్యంలో డెప్యూటేషన్ సిబ్బందికి అన్నప్రసాదాలు అందిచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నవంబరు 29వ తేదీ ఉదయం లక్షకుంకుమార్చన, సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారన్నారు. నవంబరు 30న ఉదయం ధ్వజారోహణం, డిసెంబరు 4న రాత్రి గజవాహనం, డిసెంబరు 8న పంచమితీర్థం, డిసెంబరు 9న పుష్పయాగం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆలయ డెప్యూటీ ఈవో మతి కస్తూరి బాయి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబుస్వామి, ఎస్ఇలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, డిఎస్పీలు మురళికృష్ణ, కాటంరాజు, విజివో మనోహర్, రవాణా విభాగాధిపతి శేషారెడ్డి, ఉద్యాన విభాగం ఏడి శ్రీనివాసులు, అదనపు ఆరోగ్య విభాగం అధికారి డా.సునీల్, ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, పోలీస్, పంచాయతి అధికారులతో పాటు వివిధ విభాగాల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

# రోడ్డు లేదు..వంతెన లేదు..డోలీలే శరణ్యం

విజయనగరంనవంబర్ 16, (న్యూస్ పల్స్)విజయనగరం జిల్లా కురుపాం ఏజెన్సీ ప్రాంతంలో రోడ్డు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కురుపాం మండలం ,పెదగొత్తిలి పంచాయతీ, నాగర కుంటుబాయ్ గ్రామానికి రహదారి, వంతెన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ దాదాపు 36 గిరిజన కుటుంబాలు వుంటున్నాయి. నిత్యావసర వస్తువులు, డిపో నుంచి రేషన్ తెచ్చుకోవాలన్న మధ్యలో ఉన్న గెడ్డ దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులగా కుండపోతగా వర్షాలు కురవడంతో గెడ్డలో నీరు అధికంగా చేరడంతో ఏ క్షణం ఏమవుతుందో అని ఆందోళన చెందుతున్నారు. ఆ గెడ్డలో గతంలో ముగ్గురు మృతి చెందారని గిరిజనులు వెల్లడించారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం పాలైతే 108, వాహనం గ్రామానికి రాలేని పరిస్థితి నెలకొందని, సుమారు 2 కిలోమీటర్ల దూరం డోలితో మోసుకొని గెడ్డ దాటాల్సి పరిస్థితి వస్తుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు స్కూల్ కు వెళ్లాలన్న తల్లిదండ్రుల భుజాన మోసుకొని వెళ్లాల్సిన పరిస్థితి వుంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడం అన్యాయమని అక్కడ గిరిజనులు వాపోతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమని పట్టించికునే నాధుడే లేరని, తమ బాధల్ని ఎవరితో చెప్పుకోవలో తెలియని పరిస్థితుల్లో వున్నారు ఇక్కడ గిరిజన ప్రజలు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి నాగర కుంటుబాయ్ గ్రామానికి రహదారి వేసి, వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

# రైతులకు జవాబుదారిగా వుంటాం

రామచంద్రాపురంనవంబర్ 16, (న్యూస్ పల్స్) ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి రైతు పక్షపాతని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మంత్రి మంగళవారం నాడు రామచంద్రపురం, కె. గంగవరం, కాజులూరు మండలలో పర్యటించారు. మంత్రి మాట్లాడుతూ టిడిపి నాటకాలు రామచంద్రాపురం నియోజకవర్గంలో చెల్లుబాటు కావు. రైతులకు ఎవరు ఎప్పటి నుండి క్షేత్రస్థాయిలో పర్యటన చేస్తూ...వారికి అండగా ఉందో మా నియోజకవర్గం రైతులకు బాగా తెలుసు. టిడిపి నాయకులు ఇప్పుడు వచ్చి కపటనాటకాలతో మభ్యపెట్టాలని చూస్తే నమ్మే వారు ఎవరు లేరని అన్నారు. పంట వేసుకొనే ముందు రైతుభరోసా, నష్టం జరిగిన సీజన్లోనే పంటనష్టం అందిస్తున్న ప్రభుత్వం మాది. రైతులకు జవాబుదారీగా ఉంటాం. వర్షాలు ప్రారంభమైన నవంబర్ 6వ తారీఖునే నియోజకవర్గంలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించాను. ఆరోజు నుండే పంటనష్టంపై అంచనా వేయడంతో పాటు,కౌలు రైతులను గుర్తించడం వంటి చర్యలపై అధికారులను ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీచేస్తున్నాను. నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా, రాష్ట్ర మంత్రిగా గత రెండు వారాల నుండి వర్షాలపై రైతులను ఆలర్ట్ చేస్తూ, అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకుపోతున్నాను. ఇప్పుడు వచ్చి టిడిపి నాయకులు రైతులను మభ్యపెట్టాలని చూస్తున్నారు. మీ నాటకాలు ఈ నియోజకవర్గంలో చెల్లుబాటు కావు. మా నియోజకవర్గంలో మీ మాటలకు, నాటకాలకు లొంగిపోయే బలహీనమైన మనస్తత్వం కలవారు కాదు మా రైతులని అన్నారు.కౌలురైతులను గుర్తించి, రైతులతో సమన్వయం చేసుకొని... నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకునే ప్రభుత్వం మాది అని ఇక్కడ రైతులందరికీ తెలుసు. రైతులకు , కౌలు రైతులకు మా ప్రభుత్వ పనితీరు మీదా పూర్తి నమ్మకం ఉందని మంత్రి అన్నారు.

# మహాపూర్ణాహుతితో ముగిసిన అయోధ్యకాండ పారాయణ దీక్ష

## 27 రోజుల పాటు 4,308 శ్లోకాల పారాయణం

తిరుమల, నవంబరు 16 శ్రీవారి అనుగ్రహంతో సృష్టిలోని సకల జీవరాశులు సుభిక్షంగా ఉండాలని, సకల కార్యాలు సిద్ధించాలని కోరుతూ తిరుమల వసంత మండపం, ధర్మగిరి వేద పాఠశాలలలో 27 రోజుల పాటు నిర్వహించిన అయోధ్యకాండ పారాయణదీక్ష మంగళవారం ముగిసింది. అయోధ్యకాండలోని మొత్తం 119 సర్గల్లో గల 4,308 శ్లోకాలను పండితులు పారాయణం చేశారు. అక్టోబరు 21వ తేదీ నుండి జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. చివరి రోజున వసంత మండపంలో పండితులు శ్రీ సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు.


# ఆంధ్ర సరిహద్దులో వెలవెలబోతున్న పెట్రోల్ బంకులు

చిత్తూరు జిల్లా: కర్ణాటకలోని పెట్రోల్ బంకులు వాహనదారులతో కిటకిటలాడుతుంటే.. ఏపీ సరిహద్దులో బంకులు వెలవెలబోతున్నాయి. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పెట్రోల్ ధరలు వినియోగదారులకు ఉపసమనమివ్వగా ఏపీలో మాత్రం ధరలు యధాతథంగా ఉన్నాయి. సరిహద్దు ప్రాంతాల వాహనదారులు పక్క రాష్ట్రానికి వెళ్లి పెట్రోలు కొనుగోలు చేస్తున్నారు. సేల్స్ లేకపోవడంతో పెట్రోల్ బంకులను మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంది.





# జగన్ ఆడిస్తోంది ప్రమాదకర రాజకీయ క్రీడ: రామకృష్ణ





గుంటూరు: సీఎం జగన్ ప్రమాదకరమైన రాజకీయ క్రీడ ఆడిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అమరావతి రైతుల పాదయాత్రకు మద్దతుగా కలెక్టరేట్ వద్ద సీపీఐ చేపట్టిన దీక్షలో రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర, రాయలసీమలో పోటీ పాదయాత్రలకు వైసీపీ నేతలు సిద్ధమయ్యారని తెలిపారు. అధికారంలో ఉన్న పార్టీ ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతుందని... ఈ వైఖరిని ఖండిస్తున్నామన్నారు. అమరావతి రాజధాని కోసం సుదీర్ఘమైన పోరాటంగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన ప్రకటన చేయలేదని విమర్శించారు. రాజధాని మార్పుపై విచారణ జరిపే హైకోర్టు బెంచ్‌లో న్యాయమూర్తులను మార్చమనడం దిగజారుడుతనమే అని మండిపడ్డారు. న్యాయవ్యవస్థపై ప్రభుత్వానికి గౌరవం లేదన్నారు. బీజేపీ నేతలు పాదయాత్రలో పాల్గొనాలని అమిత్ షా చెప్పినట్లు వార్తలొచ్చాయని తెలిపారు. ఈ డ్రామాలు మానుకోవాలని హితవుపలికారు. పీఎం, హోంమంత్రి రాజధాని మార్చవద్దని డైరెక్ట్‌గా సీఎంకు సలహా ఇవ్వాలని... అప్పుడు మాత్రమే ప్రజలు బీజేపీని నమ్ముతారని రామకృష్ణ పేర్కొన్నారు.

# దెందులూరులో ఎన్నికలు ప్రశాంతం

ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు వన్ ఎంపిటిసి ఎన్నికల పోలింగ్ ప్రశాంతమైన వాతావరణంలో జరిగింది. మంగళవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమయినప్పటి నుండి ఓటు వేసేందుకు ఓటర్లు భారీ ఎత్తున తరలివచ్చారు. ఎటువంటి ఘర్షణలు జరగకుండా దెందులూరు ఎస్సై ఇజ్జపు వీర్రాజు ముందస్తు చర్యలు తీసుకున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తాళ్లూరి నాగరాజు, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఇప్పిలి వెంకటేశ్వరరావు పోటీలో ఉన్నారు.

# ఏపీ ప్రభుత్వంపై జాతీయ ఎస్సీ కమిషన్ ఆగ్రహం

న్యూఢిల్లీ: మత మార్పిడులపై నివేదిక పంపడంలో జాప్యం చేస్తున్న ఏపీ ప్రభుత్వంపై జాతీయ ఎస్సీ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీలో భారీగా మత మార్పిడులు జరుగుతున్నాయని కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఫిర్యాదులపై నివేదిక ఇవ్వాలని గత జూన్‌లో ఏపీ సీఎస్‌కు జాతీయ ఎస్సీ కమిషన్ లేఖ రాసింది. దీనిపై ఏపీ ప్రభుత్వం స్పందించలేదు. మరోసారి ఏపీ సీఎస్‌కు ఎస్సీ కమిషన్ లేఖ రాసింది. 7 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.



# పత్రిక దినోత్సవం సందర్భంగా పలువురి జర్నలిస్టులకు సన్మానం



నంద్యాల నవంబర్ 16, ( విభారె) నంద్యాల పట్టణంలో మంగళవారం నాడు ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా లో సేవ చేసిన సిటీ కేబుల్ విలేఖరి ఇసాక్ భాష మరియు ప్రింట్ మీడియా ఏపీయూడబ్ల్యూజే నంద్యాల వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ జావిద్ ను సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పీసీసీ ప్రధాన కార్యదర్శి నంద్యాల అసెంబ్లీ ఇంచార్జ్ డాక్టర్ చింతల మోహన్ రావు కాంగ్రెస్ యువజన రాష్ట్ర కార్యదర్శి ఎస్ మస్తాన్ ఖాన్ జానో జాగో (ముస్లింల అభివృద్ధి వేదిక ) జాతీయ కార్యదర్శి సయ్యద్ మహబూబ్ బాషా పాస్టర్ పాల్ రాజ్ మదర్ ఫౌండేషన్ మురళి మాట్లాడుతూ నవంబర్ 16

### డాక్టర్ చింతల మోహన్ రావు కాంగ్రెసు పార్టీ ఇన్ చార్జీ

భారతదేశంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని సూచిస్తుంది, ఇది 1966లో ఏర్పడిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థాపన జ్ఞాపకార్థం జరుపుకుంటారని తెలిపారు. 16 నవంబర్ 1966న, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసిఐ) దేశంలోని నాల్గవ స్తంభానికి నైతిక కాపలాదారు యొక్క పాత్రను స్వీకరించింది, పత్రికా దాని నుండి ఆశించిన నాణ్యత మరియు ఉన్నత ప్రమాణాలను నిర్వహిస్తుంది. మరియు దీని వలన ప్రభావితం కాకుండా చూసేందుకు దాని పనితీరులో ఏదైనా బాహ్య కారణాలు. ఈ రోజు దేశంలో బాధ్యతాయుతమైన మరియు స్వేచ్ఛా ప్రెస్‌కి ప్రతీకగా నిలుస్తుంది. 1997 సంవత్సరం నుండి, కౌన్సిల్ సంబంధిత ఇతివృత్తాలతో సెమినార్ల ద్వారా ఈ రోజును గణనీయమైన రీతిలో స్మరించుకుంది.పలు ప్రెస్ / మీడియా కౌన్సిళ్లు ఉన్నాయి. ప్రపంచ కానీ గుర్తిస్తాడు ఇది ఒక ఉచిత రకమైన ఉంది పత్రికా, స్వాతంత్ర్యం పరిరక్షించడానికి తన విధి ఒక ఏకైక పరిధి ఉంది దేశం.భారతీయ ప్రెస్ అందించే రిపోర్టేజీ నాణ్యతపై ప్రెస్ కౌన్సిల్ చెక్ చేస్తుంది. "ఏదైనా బాహ్య కారకాల ప్రభావం లేదా బెదిరింపుల" కారణంగా పాత్రికేయ నిష్పాక్షికత రాజీపడకుండా కూడా ఇది నిర్ధారిస్తుంది అని ఆయన అన్నారు. భారతదేశం యొక్క ప్రెస్ కౌన్సిల్ పేరు పత్రికా నాలుగో స్తంభం వంటి దాని స్వంత బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని కోరుతూన్నాము.

# పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పేయ్

నంద్యాల నవంబర్ 16, ( విభారె) :-నంద్యాల మండలం లోని జెడ్పిటిసి ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేయడం జరిగిందని .నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు.మంగళవారం నంద్యాల మండలం లోని చాపిరేవుల గ్రామంలో జరుగుతున్న జెట్పీటిసి . చాకరాజువేముల. బుర్రా రెడ్డిపల్లె లో జరుగుతున్న ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పరిశీలించారు.నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ నంద్యాల మండలం లోని జెడ్ పి టి సి ఎన్నికలు ఈరోజు17 గ్రామపంచాయతీల లోని 47 పోలింగ్ కేంద్రాల ద్వారా పోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోలింగ్ ప్రక్రియ కు ఎనిమిది రూట్లు. నాలుగు జోన్లు గా విభజించి ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చర్యలు గై కొంటున్నామని అన్నారు.ఈ మండలంలోని సమస్యాత్మకమైన కానాల. చాబోలు. ఐలూరు 1.2. మరియు అతి సమస్యాత్మకమైన పులిమద్ది. పోలూరు. కొత్తపల్లి గ్రామాలలో ప్రత్యేక దృష్టి సారించి పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. 47 పోలింగ్ కేంద్రాల్లో21444 మంది పురుషులు22394 మంది స్త్రీలు 5 మంది ఇతరులు మొత్తం43843 మంది ఓటర్లు ఓటు హక్కు



వినియోగించుకోనున్నారని తెలిపారు .పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను నంద్యాల బొమ్మల సత్రం లో ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ వద్దకు పోలీస్ బందోబస్తు మధ్య చేర్చడం జరుగుతుందన్నారు

# జెడ్ పి టి సి మరియు ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సక్రమంగా జరుగుతున్నాయి

### ఎన్నికల అబ్జర్వర్ .హరి జవహర్ లాల్

నంద్యాల నవంబర్ 16, ( విభారె) :- జెడ్ పి టి సి మరియు ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సక్రమంగా జరుగుతున్నాయి అని ఎన్నికల అబ్జర్వర్ .హరి జవహర్ లాల్ అన్నారు.మంగళవారం నాడు నంద్యాల మండలం చాబోలు గ్రామంలో జరుగుచున్న జెడ్ పి టి సి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్నిఎన్నికల అబ్జర్వర్ .హరి జవహర్ లాల్. జెడ్పీ సీఈవో. ఎం. వెంకటసుబ్బయ్య. డి పి ఓ. కే ఎల్. ప్రభాకర్ రావు .నంద్యాల డి ఎల్ డి వో. భాస్కర్ లతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు .ఎన్నికల అబ్జర్వర్ .హరి జవహర్ లాల్ మాట్లాడుతూ జెడ్ పి టి సి మరియు ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సక్రమంగా జరుగుతున్నాయని అందులో భాగంగానే ఈరోజు నంద్యాల మండలం లోని చాబోలు గ్రామం లోని 27 నెంబర్ పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. ఈ గ్రామంలో 1092 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు అని ఆయన అన్నారు. ఈ పోలింగ్ కేంద్రం నందు విధులు నిర్వహించే సిబ్బంది సక్రమంగా చాలా బాగా విధులు నిర్వహిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు.



# అధిక వర్షాల పట్ల మిరప రైతులు అప్రమత్తంగా ఉండాలి

తుగ్గలి నవంబర్ 16, ( విభారె) : అధిక వర్షాల పట్ల మిరప సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ ఏ డి ఏ మహమ్మద్ ఖాద్రి తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మిరపలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి రైతులకు తెలియజేశారు.పొలములో నీటిని తీసివేసి అంతరకృషి చేసి నేల త్వరగా ఆరేటట్లు చేయాలి.13-0-45,అయిదు గ్రాములు లేదా 19-19-19 అయిదు గ్రాములు లేదా 2 కిలోల యూరియా పిచికారీ చెయ్యాలి.పంటకు 30 కిలోల యూరియా మరియు 15 కిలోల పొటాష్ బూస్టర్ డోస్ గా నేలకు అందించాలి.మిరపలో అధిక వర్షాలకు వేరుకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఎక్కువ అందుకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి మరియు ప్లాంటో మైసిన్ 1గ్రాము 4.5 లీటర్ల నీటికి కలిపి మొక్క మొదళ్లు తడిచే విధంగా పిచికారీ చెయ్యాలి.కాయ కుళ్లు మరియు బూజు తెగులు నివారణ కు టేబ్యుకొనాజోల్ లేదా అజాక్సి స్ట్రోబిన్ 250 ఎంఎల్ ఎకరాకు పిచికారి చెయ్యాలి,లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ మరియు ప్లానీటోమైసీన్ పిచికారి చెయ్యాలి.మిరపలో వర్షాల వల్ల పూత,పిందె,ఆకులు రాలిపోతాయి. నివారణకు బోరాన్ 1.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలి.మిరపలో కొమ్మ ఎండు తెగులు మరియు కాయ కుళ్ళు తెగులు వల్ల కొమ్మలు పై నుండి కిందకు ఎండుతాయి. పండుకాయలమీద నల్లటి మచ్చలు ఏర్పడి కాయలు కుళ్లిపోతాయి.ఈ తెగులు నివారణకు ప్రొపికోనజోల్ 200 మిల్లీ లీటర్లు లేదా ఢిఫెన్కోనజోల్ 100 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చెయ్యాలని పత్తికొండ ఏడిఏ మహమ్మద్ ఖాద్రి రైతులకు తెలియజేశారు.

# ప్రాథమిక వైద్యశాల అభివృద్ధి కొరకు కృషి చేస్తా...

### ఎంపీపీ ఆదెమ్మ



తుగ్గలినవంబర్ 16, ( విభారె) ప్రాథమిక వైద్యశాల అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని తుగ్గలి మండల ఎంపిపి ఆదెమ్మ తెలియజేశారు.మంగళవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఏర్పాటు చేసిన హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ మొదటి సమావేశంలో మండల స్థాయి అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కావలసిన సౌకర్యాలు మరియు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని చర్చించుకున్నారు. మండల స్థాయి అధికారుల మరియు ప్రజా ప్రతినిధుల సమిష్టి కృషితో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నజ్మా భాను, ఎంపీడీవో వీర రాజు,మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్,ఎంపీటీసీ దేవరాజు,రాంకొండ సర్పంచ్ పాటిల్ హారిక,వైసిపి నాయకులు రంగన్న,పాటిల్ సుధాకర్ రెడ్డి,ప్రాథమిక వైద్య శాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మబు సుభాని గ్యార్మీ గంధం వేడుకలు

కౌతాళం నవంబర్ 16, ( విభారె) మండలం లో మాబు సుభాని గ్యార్మీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు కౌతాళం లో దర్గా ధర్మకర్త అల్లా భకాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ధర్మకర్త మాట్లాడుతూ ముస్లిం సోదరులు మబు సుభాని గ్యార్మీ పండుగ ఒక నెల రోజులు జరుపుకునే పండుగ అని భక్తిశ్రద్ధలతో ముస్లిం కుటుంబ సభ్యులతో ఉరుసు ఉత్సవాలను జరుపు కుంటారని తెలిపారు. భక్తిశ్రద్ధలతో భగవంతుని ప్రర్తించినప్పుడు భగవంతుని సేవకు ముగ్దులు అవుతారని ,అందరూ మంచి భక్తీ మార్గం లో నడవాలని కోరారు. దర్గాను విద్యుత్ దీపాలతో రంగులతో పూలమాలలుతో అలంకరించారు. మగరీబ్ .నమాజ్ అనంతరం గంధం, జెండా జూలూస్ భారీగా పూలతో అలంకరించి కాలనీల్లో దర్గా నుంచి బుడ్డప్ప సర్కిల్ జగద్గురు ఖాదర్ లింగ స్వామి మీదుగా భారీగా ఊరేగింపుగా ఊరేగించారు. గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు అనంతరం మబుసుభాని దర్గాలో జెండాను ఎగురవేశారు.

# ఓవర్సీస్ లోనూ పర్వాలేదనిపించిన 'పుష్పక విమానం'




విజయ్ దేవరకొండ తమ్ముడు ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన కొత్త సినిమా "పుష్పక విమానం" గత శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తొలి రోజు యావరేజ్ టాక్ తెచ్చుకున్న ఈ మూవీ వసూళ్ళ పరంగా పర్వాలేదనిపిస్తోంది. ఓవర్ సీస్ లోనూ ఈ సినిమా ఓ మోస్తరుగా కలెక్షన్స్ రాబడుతోంది.యూఎస్ లో శనివారం వరకే ఈ సినిమా 70 వేల అమెరికన్ డాలర్స్ దాకా కలెక్షన్స్ రాబట్టింది. ఇక ఆస్ట్రేలియాలో 16512 డాలర్లు కలెక్ట్ చేసినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సినిమా ఆశించిన స్థాయిలో వసూళ్ళు సాధిస్తోందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.డైరెక్ట్ ఓటీటీ విధానంలో విడుదలైన 'మిడిల్ క్లాస్ మెలోడీస్' సినిమాతో మంచి సక్సెస్ అందుకున్న ఆనంద్ దేవరకొండ.. ఇప్పుడు "పుష్పక విమానం" చిత్రంతో కమర్షియల్ హిట్ అందుకుంటారో లేదో అనేది మరికొన్ని రోజుల్లో తెలిపోతుంది.కాగా 'పుష్పక విమానం' చిత్రంలో ఆనంద్ దేవరకొండ సరసన గీత్ సైని - శాన్వి మేఘన హీరోయిన్లుగా నటించారు. సునీల్ - నరేష్ - హర్షవర్ధన్ - అజయ్ - సుదర్శన్ ఇతర పాత్రలు పోషించారు. విజయ్ దేవరకొండ సమర్పణలో కొత్త దర్శకుడు దామోదర ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.కింగ్ అఫ్ ది హిల్ ప్రొడక్షన్ మరియు టాంగా ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై గోవర్ధన్ రావు దేవరకొండ - విజయ్ మట్టపల్లి - ప్రదీప్ ఎర్రబెల్లి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. రామ్ మిరియాల - సిద్దార్థ్ సదాశివుని - అమిత్ దాసాని ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు. హెస్టిన్ జోస్ జోసెఫ్ సినిమాటోగ్రఫీ అందించారు.

# 'ఈ రాతలే'.. 'రాధే శ్యామ్' నేపథ్యాన్ని తెలియజేసే ప్రేమగీతం..!

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ - పూజ హెగ్డే జంటగా నటిస్తోన్న తాజా చిత్రం "రాధే శ్యామ్". జిల్ ఫేమ్ రాధాకృష్ణ కుమార్ ఈ పీరియాడికల్ ప్రేమకథా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా విడుదల కానున్న ఈ సినిమా మ్యూజికల్ అప్డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో మేకర్స్ ఎన్నో ట్రోల్స్ ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే డార్లింగ్ ఫ్యాన్స్ నిరీక్షణకు తెరదించుతూ చిత్ర బృందం 'ఈ రాతలే' అనే ఫస్ట్ సింగిల్ ని తాజాగా విడుదల చేసింది.కొన్ని అనివార్య కారణాల వల్ల 'ఈ రాతలే' పాటను మేకర్స్ అనుకున్న సమయానికి విడుదల చేయలేకపోయారు. అయితే ఇప్పుడు లిరికల్ వీడియో వచ్చాక.. వారి ఎదురు చూపులకు తగిన స్టఫ్ లభించిందనే చెప్పాలి. "ఎవరో వీరెవరో.. కలవని ఇరు ప్రేమికులా.. ఎవరో వీరెవరో విడిపోనీ యాత్రికులా.." అంటూ సాగిన ఈ గీతం శ్రోతలను విశేషంగా అలరిస్తోంది. ప్రభాస్ - పూజా హెగ్డేల మోషన్ పోస్టర్స్ తో రూపొందిన ఈ సాంగ్ సినిమా నేపథ్యాన్ని ఆవిష్కరిస్తోంది. తెలుగు తమిళ మలయాళ కన్నడ భాషల్లో ఈ పాట విడుదలైంది.రైలులో ప్రయాణిస్తున్న తన ప్రేయసి చెయ్యిని అందుకోవాలని కారులో ప్రయనిస్తున్న ప్రేమికుడు ప్రయత్నించగా పెద్ద ప్రమాదం జరుగుతుంది. ఈ క్రమంలో అతను ఆమెను తన కారులో ఎక్కించుకొని లోకాలన్నీ విహరిస్తున్నాడు. ఈ ప్రేమ జంట విధిని ఎదిరించి చివరకు ఒకటైనట్లు 'ఈ రాతలే' లిరికల్ వీడియో సూచిస్తోంది. జస్టిన్ ప్రభాకరన్ ఈ పాటకు ఫ్రెష్ ట్యూన్ ని కంపోజ్ చేశారు. యువన్ శంకర్ రాజా - హరిణి ఇవటూరి కలిసి వినసొంపుగా ఆలపించారు. తెలుగు వెర్షన్ కు లిరిసిస్ట్ కృష్ణకాంత్ సినిమా నేపథ్యాన్ని వివరించేలా సాహిత్యం అందించారు.అనిల్ కుమార్ ఉపాధ్యాయుల - వెంకీ కలిసి 'ఈ రాతలే' కాన్సెప్ట్ డిజైన్ చేశారు. మనోజ్ పరమహంస ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించగా.. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ వర్క్ చేశారు. 'రాధే శ్యామ్' సినిమాని యూవీ క్రియేషన్స్ - గోపీకృష్ణ మూవీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇటలీ బ్యాక్ డ్రాప్ లో 70ల కాలం నాటి ప్రేమకథతో ఈ సినిమా రూపొందుతోంది. ప్రభాస్ ఇందులో విక్రమాదిత్య అనే హస్తసాముద్రికా నిపుణుడిగా కనిపించనున్నారు. ఆయన ప్రేయసి ప్రేరణగా పూజా హెగ్డే అలరించనుంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని 2022 జనవరి 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.




# సినిమా తీసే లోపు రాంబాబుకు సినిమా చూపిస్తారా..?




విక్టరీ వెంకటేష్ హీరోగా నటించిన తాజా చిత్రం "దృశ్యం 2". ఇది మలయాళంలో మోహన్ లాల్ నటించిన 'దృశ్యం 2' చిత్రానికి అధికారిక తెలుగు రీమేక్. సూపర్ హిట్ 'దృశ్యం' సినిమాకు సీక్వెల్. మలయాళ డైరెక్టర్ జీతూ జోసెఫ్ ఈ థ్రిల్లర్ చిత్రానికి దర్శకత్వం వహించారు.మాతృక బాటలో థియేట్రికల్ స్కిప్ చేసి ఓటీటీలో విడుదల అవుతోంది. ప్రముఖ డిజిటల్ ఫ్లాట్ ఫార్మ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో నవంబర్ 25 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన మేకర్స్.. టీజర్ తో సినిమాపై ఆసక్తిని కలిగించారు. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్ ను రిలీజ్ చేశారు.'దృశ్యం' సినిమా ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే 'దృశ్యం 2' సినిమా మొదలైంది. కాకపోతే కేబుల్ ఆపరేటర్ అయిన రాంబాబు ఇందులో థియేటర్ ఓనర్ గా కనిపిస్తున్నాడు. అలానే నిర్మాతగా సినిమా తీయాలనే తన చిన్ననాటి కలను నెరవేర్చికోడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు.అయితే ఆరేళ్లుగా మిస్టరీగా మిగిలిపోయిన వరుణ్ మర్డర్ కేసు విషయంలో రాంబాబు మరియు అతని ఫ్యామిలీ మీద పోలీసులు నిఘా పెట్టారని తెలుస్తోంది. అంతేకాదు వారు హత్య చేసినట్లు నిరూపించడానికి రాంబాబు చుట్టూ ఏదో పన్నాగం పన్నినట్లు సందేహాలు కలిగిస్తోంది.మరోవైపు నరేష్ - నదియా తమ కొడుకు ఎప్పుడు ఎలా చనిపోయాడో తెలియక బాధ పడుతున్నట్లు చూపించారు. భార్యాపిల్లలతో కలిసి ఆనందంగా గడుపుతున్న రాంబాబు లైఫ్ లోకి మళ్ళీ పోలీసులు రావడం.. తమశైలిలో ఇన్వెస్టిగేషన్ చేయడం వంటి అంశాలు కనిపిస్తున్నాయి.సినిమా తీసే లోపు రాంబాబుకు సినిమా చూపించాలని ఫిక్స్ అయిన పోలీసులు పాత మర్డర్ కేసును తిరగదోడిన నేపథ్యంలో రాంబాబు ఫ్యామిలీ మళ్లీ ఎలాంటి సమస్యలు ఎదుర్కోవలసి వచ్చింది? ఎప్పటిలాగే తన తెలివితేటలతో ఈ కేసు నుంచి బయటపడ్డారా లేదా? అనేది తెలియాలంటే "దృశ్యం 2" సినిమా చూడాల్సిందే.'దృశ్యం 2' చిత్రంలో వెంకటేష్ గడ్డం పెంచుకొని మొదటి భాగం కంటే డిఫరెంట్ గా కనిపించారు. వెంకీ భార్యగా సీనియర్ హీరోయిన్ మీనా.. కుమార్తెలుగా ఎస్తర్ అనీల్ - కృతికా నటించారు. సంపత్ నంది - తనికెళ్ళ భరణి - జయకుమార్ - సత్యం రాజేష్ - తాగుబోతు రమేష్ - చలాకీ చంటి - ముక్కు అవినాష్ వంటి వారు ఇతర పాత్రలు పోషించారు. ఈ ట్రైలర్ పై అనూప్ రూబెన్స్ అందించిన బ్యాగ్రౌండ్ స్కోర్ ఉత్కంఠకు గురి చేస్తోంది.సతీష్ కురూప్ సినిమాటోగ్రఫీ అందించగా.. మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటింగ్ వర్క్ చేశారు. డైరెక్టర్ జీతూ ఈ సినిమా కోసం మార్పులేవీ చేయకుండా ఒరిజినల్ మాదిరిగానే తీర్చిదిద్దారని తెలుస్తోంది.సురేష్ ప్రొడక్షన్స్ - మాక్స్ మూవీస్ - రాజ్ కుమార్ థియేటర్స్ ప్రై. లిమిటెడ్ బ్యానర్స్ పై ఈ సినిమా రూపొందింది. డి.సురేష్ బాబు - ఆంటోనీ పెరుంబవూర్ - రాజ్ కుమార్ సేతుపతి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. 'నారప్ప' తర్వాత అమెజాన్ ప్రైమ్ వీడియోలో డైరెక్ట్ ఓటీటీ విధానంలో విడుదలవుతున్న 'దృశ్యం 2' ఎలాంటి ఆదరణ దక్కించుకుంటుందో చూడాలి.

# భారత్‌తో టీ20 సిరీస్ ముందు కివీస్‌కు షాక్.. తప్పుకొన్న విలియమ్సన్.. ఎందుకంటే..



టీమిండియాతో టీ20 సిరీస్‌కు ముందు న్యూజిలాండ్‌కు భారీ షాక్ తగిలింది. సుదీర్ఘ కాలంగా మోచేతి గాయంతో బాధపడుతున్న కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ జట్టుకు దూరం కానున్నాడు. కొన్నాళ్లపాటు విశ్రాంతి తీసుకున్న తర్వాత టెస్టు సిరీస్ నాటికి టీమ్‌తో మమేకం కానున్నాడు. కాగా టీ20 వరల్డ్‌కప్ 2021లో న్యూజిలాండ్‌ను తొలిసారి ఫైనల్‌కు చేర్చిన సారథిగా విలియమ్సన్ గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. అయితే, విశ్వవిజేతగా నిలవాలన్న కేన్ బృందం ఆశలపై నీళ్లు చల్లి.. ఆస్ట్రేలియా ట్రోఫీని ఎగురేసుకుపోయింది. దీంతో కివీస్ రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.ఇక ప్రపంచకప్ ఫైనల్ ముగిసిన మూడు రోజుల వ్యవధిలోనే టీమిండియాతో సిరీస్ ఆరంభం కానున్న నేపథ్యంలో యూఏఈ నుంచి కివీస్ ఆటగాళ్లు జైపూర్‌కు చేరుకున్నారు. నవంబరు 17 నుంచి మొదలుకానున్న పొట్టి ఫార్మాట్ సిరీస్‌కు సన్నద్ధమవుతున్నారు. కాగా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ తర్వాత.. వరల్డ్‌టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుంది. ఈ నేపథ్యంలో మొట్టమొదటి డబ్ల్యూటీసీ టైటిల్ గెలిచిన కెప్టెన్‌గా చరిత్ర లిఖించిన విలియమ్సన్.. పూర్తిస్థాయిలో ఈ సిరీస్‌పై దృష్టి సారించాలని భావిస్తున్నాడట.స్వదేశంలో కొరకరాని కొయ్యగా మారే భారత జట్టుకు చెక్ పెట్టేందుకు వ్యూహాలు రచిస్తున్నాడట. ఇందుకు తోడు గాయం కూడా వేధిస్తుండటంతో టీ20 సిరీస్‌కు దూరం కావాలని విలియమ్సన్ నిర్ణయించుకున్నట్లు న్యూజిలాండ్ క్రికెట్ తెలిపింది. కాగా టీ20 సిరీస్‌కు కేన్ విలియమ్సన్ దూరమైన నేపథ్యంలో అతడి స్థానంలో టిమ్ సౌథీ సారథిగా పగ్గాలు చేపట్టనున్నట్లు పేర్కొంది. ఇక టీ20 సిరీస్ నేపథ్యంలో రోహిత్ శర్మ తొలిసారి పూర్తిస్థాయిలో టీమిండియా కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనుండగా.. మొదటి టెస్టుకు అజింక్య రహానే, రెండో టెస్టుకు రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లి సారథ్యం వహించనున్నారు.

టీమిండియాతో టీ20 సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు ఇదే:టాడ్ ఆస్లే, ట్రెంట్ బౌల్ట్, మార్క్ చాప్‌మన్, లోకీ ఫెర్గూసన్, మార్టిన్ గప్టిల్, కైలీ జెమీషన్, ఆడమ్ మిల్నే, డారిల్ మిచెల్, జిమ్మీ నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ సాంట్నర్, టిమ్ సీఫర్ట్, ఇష్ సోధి, టిమ్ సౌథీ(కెప్టెన్).

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190